వికీపీడియా గురించి మీకు తెలుసా?

స్వచ్ఛందంగా రాయడం, ఉచితంగా చదువుకోవడం

వికీపీడియా గురించి మీకు తెలుసా?

స్వచ్ఛందంగా రాయడం, ఉచితంగా చదువుకోవడం

వికీపీడియా గురించి మీకు తెలుసా?

స్వచ్ఛందంగా రాయడం, ఉచితంగా చదువుకోవడం

తెలుగు వికీమీడియన్స్ యూజర్‌గ్రూప్

తెలుగు వికీమీడియన్ల వాడుకరి సమూహం

TELUGU WIKIMEDIANS
USER GROUP

వికీపీడియా గురించి మీకు తెలుసా?
స్వచ్ఛందంగా రాయడం, ఉచితంగా చదువుకోవడం

రచన: తెలుగు వికీమీడియన్స్ యూజర్‌గ్రూప్

ప్రథమ ముద్రణ: డిసెంబర్ 2024
(హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన 2024 సందర్భంగా)

ప్రచురణ: తెలుగు వికీమీడియన్స్ యూజర్‌గ్రూప్

సౌజన్యం: తెలుగు వికీ సముదాయం, వికీమీడియా ఫౌండేషన్,
సిఐఎస్ ఎ2కె

పుస్తకం & ముఖపత్రం డిజైన్: సుస్మిత టి.

పేజీలు: 50

కవర్ పేజీపై లోగో : Susannaanas, CC0, వికీమీడియా కామన్స్
ద్వారా
పుస్తకం లైసెన్సు: సీసీ-బై-ఎస్ఎ 4.0

సమాచార సౌజన్యం: ఈ పుస్తకం లోని సమాచారంలో కొంత భాగాన్ని
గతంలో వికీపీడియాలో వివిధ సందర్భాల్లో ప్రచురితమైన సమాచారం
నుండి సేకరించాం.

విషయసూచిక

వికీపీడియా	**9**
వికీమీడియా ఫౌండేషన్	**27**
మీడియావికీ సాఫ్టువేరు	**28**
ఫౌండేషను స్థాపించిన వికీ ప్రాజెక్టులు	**29**
వికీసోర్స్	**33**
విక్షనరీ	**39**
వికీకోట్	**42**
వికీబుక్స్	**43**
వికీమీడియా కామన్స్	**44**
వికీడేటా	**46**
తెవికీ సంస్కృతి	**47**

తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్

తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్ 2024 ఫిబ్రవరి 29న వికీమీడియా ఫౌండేషన్ ఆమోదంతో ఏర్పడింది. గ్రూప్ లక్ష్యాలు ప్రధానంగా:

- తెలుగు వికీమీడియా ప్రాజెక్టుల (బహుళ భాషల ప్రాజెక్టులు సహా) అభివృద్ధి, ప్రాచుర్యం కోసం కృషి చేయడం;
- మరింతమంది తెలుగువారికి వికీమీడియా ప్రాజెక్టుల గురించి తెలియజెప్పడం, వాటిలో శిక్షణనివ్వడం.
- తెలుగు వికీమీడియన్లు, ఇతర భారతీయ భాషల వికీమీడియన్లు - ఒకరి అభివృద్ధి, కృషి గురించి మరొకరు తెలుసుకుని, ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవడానికి వీలు కల్పించడం.
- తెలుగు వికీమీడియన్లు వికీమీడియా ప్రాజెక్టులకు మరింతగా మెరుగ్గా కంట్రిబ్యూట్ చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపరచడానికి కృషిచేయడం.
- తెలుగు వికీమీడియా సముదాయం చేపట్టే కార్యకలాపాలకు అవసరమైన మేరకు మద్దతు ఇవ్వడం.

గ్రూప్ లక్ష్యాలకు తగినట్లుగా తెలుగు వికీలో ఆన్లైన్ శిక్షణా కార్యక్రమాలు (తెవికిబడి), బయటి అవగాహన, శిక్షణా కార్యక్రమాలు, వికీమీడియన్లతో సమావేశాలు, హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో విస్తృత ప్రచారం, వికీమీడియా కామన్స్, వికీసోర్స్ లలో ప్రత్యేకమైన ప్రాజెక్టులు వంటివి నిర్వహిస్తున్నారు. తెలుగు వికీమీడియన్స్ యూజర్ గ్రూప్ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు రూపొందించాలి, కార్యక్రమాలు మరింత విస్తరించాలనే ప్రణాళికలో ఉంది.

వికీపీడియా

వికీపీడియా అంటే అందరు ఉచితంగా చదవగల ఒక విజ్ఞాన సర్వస్వం!

విజ్ఞాన సర్వస్వం అంటే ---

చిన్నప్పుడు మీరు వామన గుంటలు, కోతి కొమ్మచ్చి, ఏడుపెంకులాట ఆడుకున్నారా? అయితే అదృష్టవంతులే! మరి మీ పిల్లలు? వాళ్ళకసలు వాటి పేర్లు కూడా తెలీదేమో! మరి మనం ఆడుకున్న ఆ ఆటలు మనతో అంతరించిపోవాల్సిందేనా? మన పిల్లలకు, వాళ్ళ పిల్లలకు వాటి గురించి చెప్పాలంటే ఎలా? ఎక్కడో ఒకచోట వాటి గురించి రాసి పెడితే, ముందు తరాల వాళ్ళు వాటి గురించి తెలిసికోగలుగుతారు. ఇలా లోకంలోని ప్రతీ విషయం గురించీ ఒక పుస్తకంగా రాస్తే... అదే విజ్ఞాన సర్వస్వం!

తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు చాలా అరుదు. అందునా ఎన్సైక్లోపీడియా బ్రిటానికా లాంటి బృహత్తర విజ్ఞాన సర్వస్వం అసలు లేనేలేదు. సాహిత్య అకాడమీ ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం ఉన్నా, అది సాహిత్య విషయాలకే పరిమితమైంది. ఆవకాయ నుండి అంతరిక్షం దాకా, అటుకుల దగ్గర నుండి అణుబాంబు దాకా ప్రతీ విషయాన్ని వివరిస్తూ సాగే విశాల, విశిష్ట విజ్ఞాన సర్వస్వాన్ని తయారుచెయ్యడమంటే మామూలు విషయం కాదు. అపార ధనవ్యయం, అశేషమైన పనిగంటలు, అనంతమైన పరిశోధన కావాలి. సకల వనరులూ ఉన్న ప్రభుత్వమో, డబ్బును గుమ్మరించగల పోషకులో పూనుకుంటే తప్ప, ఇలాంటి మహత్కార్యాలు సాధ్యం కావు. అటువంటి బృహత్కార్యాన్ని సాధించేందుకు నడుం కట్టారు, తెలుగువారు. ఐతే ఈ పనికి

పూనుకున్నది ప్రభుత్వాలూ, లక్ష్మీ పుత్రులూ కాదు..., కేవలం మనలాంటి సామాన్యులే భుజం భుజం కలిపి ఈ పని చేస్తున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.. వందల మంది ఇందులో భాగస్తులు. పదిహేను వందల పైచిలుకు ఉత్సాహవంతులు నిరంతరం శ్రమిస్తూ కోట్ల మందికి ఉపయోగపడగల ఒక విజ్ఞాన కోశాన్ని తయారు చేస్తున్నారు. ఇంతకీ ఏమిటీ విజ్ఞాన కోశం? ఎక్కడ రాస్తున్నారు, ఎవరు రాస్తున్నారు? అదే వికీపీడియా! స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం.

అసలు వికీపీడియా అంటే ఏమిటంటే...

అప్పుడెప్పుడో 2001 లో మొదలైంది ఈ కథ. లోకం లోని విజ్ఞానాన్నంతటినీ ఒకచోట చేర్చి ప్రజలంతా స్వేచ్ఛగా వాడుకునే వీలు కల్పించాలనే సంకల్పంతో మొదలైంది. ఎక్కడుంది ఈ విజ్ఞానం... భాండాగారాల్లో ఉంది, సైన్సు పేపర్లలో ఉంది, పుస్తకాల్లో ఉంది, వార్తా పత్రికల్లో ఉంది, పెద్దపెద్ద సర్వర్లలో ఉంది, పర్సనల్ కంప్యూటర్లలో ఉంది, మెమరీ చిప్‌లలో ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ కొందరో అందుకోగలిగే తావుల్లో ఉంది. దీన్నంతటినీ ఎలా తెస్తారు? ఎవరు తెస్తారు? ఎక్కడ పెడతారు?

ఎలా తెస్తారు: ఈ సమాచారాన్నంతటినీ చదివి, తేనెటీగలు మకరందాన్ని సేకరించినట్లు వాటిలోని సారాన్ని సేకరించి తెస్తారు.

ఎవరు తెస్తారు: స్వచ్ఛందంగా పనిచేసే చదువరులు, లేఖకులు, మేమూ ఇంకా మీరూ...

ఎక్కడ చేరుస్తారు: ఇదిగో ఈ వికీపీడియాలో.

వికీపీడియా అనే పేరు ఎలా వచ్చిందంటే...

చకచక, పకపక, గబగబ, సలసల, టపటప, తపతప అంటూ జమిలి

పదాలున్నాయి కదా మనకు. విడిగా వాటికి అర్థం లేదు, కానీ జంటగా చక్కటి అర్థాన్నిస్తాయి. అలాంటి జమిలిపదాలే హవాయీ భాషలో కూడా ఉన్నాయి. వాటిలో వికివికి అనే మాట ఒకటి. దాని అర్థం చకచక/గబగబ అని. ఆశ్చర్యంగా ఉందా? ఔను, నిజమే!

హవాయి విమానాశ్రయంలో ఈ మాట విన్న వార్డ్ కన్నింగ్‌హామ్ అనే పెద్దాయనకు అది నచ్చి, 1995 లో తన వెబ్‌సైటుకు ఆ పేరు పెట్టాడు. ఎవరైనా మార్పుచేర్పులు చేసేలా, ఆ మార్పులు కూడా చకచకా చెయ్యగలిగేలా ఆ వెబ్‌సైటును తయారుచేస్తూ దానికి వికివికివెబ్ అని పేరు పెట్టాడు. ఆ వికీ అనే పేరునే తరువాత వికీపీడియాకు కూడా వాడారు. వికివికి+ఎన్‌సైక్లోపీడియా = వికీపీడియా అన్నమాట! వికీపీడియా ప్రస్తుతం 353 భాషల్లో ఉంది. తెలుగులో వికీపీడియా 2003 డిసెంబరులో మొదలైంది. మనం దీన్ని గబగబపీడియా అనో చకచకవిజ్ఞానం అనో కూడా అనుకోవచ్చు. తెలుగు వికీపీడియాకు అది ప్రత్యేకం!

స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం

వికీపీడియా అనేది ఎన్సైక్లోపీడియా పేరును అనుసరిస్తూ పెట్టిన పేరు. 2001 లో జిమ్మీ వేల్స్ అనే అమెరికనుకు వచ్చిందీ స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం ఆలోచన. ఎవరైనా రాయగలిగేదీ, చదువుకునేందుకు ఇంటర్నెట్లో అందరికీ ఉచితంగా అందుబాటులో ఉండేదీ ఈ స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం. కార్య సాధకుడవడం చేత ఆలోచన వచ్చాక ఇక ఊరుకోలేదు, జిమ్మీ. తన ఆలోచనకు ఆకారమిస్తూ వికీపీడియాకు శ్రీకారం చుట్టాడు. అప్పటికే తాను రూపొందిస్తూ ఉన్న నుపీడియా అనే విజ్ఞాన సర్వస్వాన్ని పేరు మార్చి వికీపీడియాగా మొదటగా ఇంగ్లీషు భాషలో మొదలుపెట్టాడు. వికీపీడియా చాలా త్వరగా ప్రజల మన్నలను పొందింది. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పెరిగి విశ్వవ్యాప్తమైంది. జర్మను, జపనీసు, స్పానిషు, ఫ్రెంచి, ఇటాలియను, రష్యను, చైనీసు ఇలా ప్రపంచ వ్యాప్తంగా అనేక ఇతర భాషల్లోనూ వికీపీడియాలు మొదలయ్యాయి. గొప్ప గొప్ప వ్యాసాలెన్నో

తయారయ్యాయి, అవుతూ ఉన్నాయి. ఇంటర్నెట్లో వివిధ భాషలకు ప్రత్యేకించిన వెబ్ సైట్లలో ఈ విజ్ఞాన సర్వస్వాన్ని రాస్తున్నారు.

ఏమిటి దీని విశిష్టత?

- వికీ అంటే ఎవరైనా సవరణలు (దిద్దుబాటు) చెయ్యగల ఆన్లైన్ ఎన్సైక్లోపీడియా (వెబ్సైటు) అని అర్థం. వికీపీడియా అంటే ఎవరైనా దిద్దుబాటు చెయ్యగల ఎన్సైక్లోపీడియా. వికీపీడియా విజయ రహస్యమంతా ఈ వికీ అనే మాటలోనే ఉంది.

- వికీపీడియాలో రాసేది ఎవరో ప్రముఖ విద్యావంతులో, ప్రత్యేకంగా అందుకోసం నియమితులైన రచయితలో కాదు. మనలాంటి వారంతా అక్కడ రాస్తున్నారు. వికీపీడియాలో ఎవరైనా రాయవచ్చు, ఏ విషయం గురించైనా రాయవచ్చు. కొన్ని నిబంధనలకు, కట్టుబాట్లకు లోబడితే చాలు.

- అలాగే వికీపీడియాలోని వ్యాసాలను ఎవరైనా ఉచితంగా చదువుకోవచ్చు, డబ్బు కట్టక్కరలేదు. అంతేనా, ఆ వ్యాసాలను మీరు ప్రింటు తీసుకోవచ్చు. అసలు వికీపీడియా మొత్తాన్ని మీ కంప్యూటరు లోకి డౌనులోడు చేసుకోవచ్చు - పైసా డబ్బు చెల్లించకుండా!!

- ఇంకా అయిపోలేదు, ఈ మొత్తం వికీపీడియాను ప్రింటు తీసేసి, పుస్తకాలుగా కుట్టేసుకోవచ్చు. ఆగండి, ఇంకా ఉంది... ఈ పుస్తకాలను పెద్దసంఖ్యలో ప్రింటేసి, వెల కట్టి అమ్ముకోనూ వచ్చు!!!! వికీపీడియా మిమ్మల్ని పన్నెత్తి మాటనదు, పైసా డబ్బడగదు. ఒకే ఒక్కమాట - దీన్ని నేను వికీపీడియా నుండి సేకరించాను అని రాస్తే చాలు.

భారతీయ భాషల్లో వికీపీడియా

2001 లో ఇంగ్లీషుతో మొదలైన వికీపీడియా, నిదానంగా ఇతర భాషలకూ విస్తరించి, ఇప్పుడు 350 కు పైగా భాషల్లో తయారవుతోంది. అందులో తెలుగూ ఒకటి. దాంతోపాటు హిందీ, సంస్కృతం, తమిళం, మలయాళం, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఒరియా, అస్సామీ, ఉర్దూ, ఇలా దాదాపుగా అన్ని ప్రముఖ భారతీయ భాషల్లోనూ వికీపీడియా తయారవుతోంది. వ్యాసాల సంఖ్య పరంగా ఉర్దూ, తమిళం, హిందీ, బెంగాలీ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఒకప్పుడు 7 వ స్థానంలో ఉన్న తెలుగు వికీపీడియా 2024 లో పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ముందుకు సాగి ఐదవ స్థానానికి చేరింది. ఈ క్రమంలో లక్ష వ్యాసాల మెట్టును కూడా అధిరోహించింది. చకచకా రెండవ లక్ష చేరుకోడానికి, మరో రెండు స్థానాలు ముందుకు వెళ్ళడానికీ ఒకటే మార్గం - మీరు కూడా వికీపీడియాలో రాయడమే.

వికీపీడియాలో ఏమేం రాస్తున్నారు

తెలుగు వికీపీడియా (తెవికీ) వెబ్ అడ్రసు: http://te.wikipedia.org. చరిత్ర, సంస్కృతి, ప్రముఖ వ్యక్తులు, సినిమా, భాష, నగరాలు, పట్టణాలు, గ్రామాలు, రచయితలు, కంప్యూటర్లు, సైన్సు, రాజ్యాంగ వ్యవస్థ, నదులు... ఇలా ఎన్నో విషయాలపై రాస్తున్నారు. లక్షా ముప్పై వేలకు పైగా వాడుకరులు (అంటే యూజర్లు) లక్షకు పైగా వ్యాసాల మీద ప్రస్తుతం పని చేస్తున్నారు. ప్రఖ్యాత రచయితలు, సంఘసేవకులూ కూడా వికీపీడియాలో రాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని ప్రతీ ఒక్క గ్రామానికీ సంబంధించిన విలువైన సమాచారం తెవికీలో లభిస్తుంది. మరే ఇతర వెబ్‌సైటులోనూ ఒకేచోట ఇంత సమాచారం లభించదు.

అది సరేగానీ...

అంతా ఉచితమే అంటున్నారు, ఇంత శ్రమపడి, అష్టకష్టాలు పడి తయారుచేసేది, ఊరికినే ఎవరికిబడితే వాళ్ళకు ఇచ్చెయ్యడానికేనా?

- అవును, సరిగ్గా అందుకే!! లోకంలో లభించే విజ్ఞానాన్నంతా ప్రజలందరికీ ఉచితంగా అందించాలనే సదాశయంతోనే వికీపీడియా మొదలయింది. వికీపీడియా స్థాపనకు ప్రాతిపదికే అది. అన్నట్టు అష్టకష్టాలు ఏమేంటో మీకు తెలుసా? తెలియకపోతే తెలుగు వికీపీడియాలో చూడండి.

ఎవరైనా రాయవచ్చంటున్నారు, మరి, నేనూ రాయవచ్చా?

- నిక్షేపంగా రాయవచ్చు, ఇతరులు రాసిన వ్యాసాలను సరిదిద్దనూ వచ్చు. రాయాలి కూడా.

దేని గురించి రాయవచ్చు?

- మీకు తెలిసిన ఏ విషయం గురించైనా రాయవచ్చు. మీ ఊరి గురించి రాయండి. మీ ఊరి ఫోటోను పేజీలో పెట్టండి. ఈ మధ్య మీరు చదివిన పుస్తకం గురించో, మీరు చూసిన సినిమా గురించో రాయండి. అన్నట్టు మాయాబజారు సినిమా గురించి, చందమామ పుస్తకం గురించి వికీపీడియాలో వ్యాసాలు చూడండి. ఈ వ్యాసాల్లోని సమాచారాన్ని తీసుకుని కొన్ని పత్రికల్లో వాడుకున్నారు కూడాను.

మరి, నాకు కంప్యూటర్లో తెలుగు టైపు చెయ్యడం ఎలాగో రాదే, ఎలాగా?

- ఏం పర్లేదు, తెవికీలో వివిధ రకాల తెలుగు టైపింగు ఉపకరణాలు

ఉన్నాయి. మీకు తెలుగు చదవడం రాయడం వస్తే చాలు, టైపింగు మీచేత అదే చేయిస్తుంది.

కానీ నా ఆఫీసు పనులు, ఇంటి పనులతో బిజీగా ఉంటాను కదా, వికీపీడియాలో రాస్తూ ఉంటే ఆ పనులేం గాను?

- మీ పనులన్నీ వదిలేసి, అక్కడ రాయనవసరం లేదు. మీ తీరిక సమయంలోనే రాయండి. హాయిగా రాయండి. అక్కడ రాసే సభ్యులంతా అలా రాసేవాళ్ళే! రోజూ రాయండి. వారానికి ఒక్కసారే రాయండి, నెలకోసారి రాయండి... మీ ఇష్టం, మీ వెసులుబాటు, మీ తీరిక, మీ ఓపిక.

కానీ రాయడం నాకు కొత్త, తప్పులు దొర్లుతాయేమో?

- నిజమే, మొదట్లో తప్పులు దొర్లవచ్చు. కానీ రాసుకుంటూ పోతుంటే ఆ తప్పులన్నీ సద్దుమణిగి, మీ భాష వికసిస్తుంది. వికీపీడియా సభ్యులకిది అనుభవమే. అంతేగాక, మీ రచనలోని భాషా దోషాలను సరిదిద్దడానికి ఇతర సభ్యులు సదా సిద్ధంగా ఉంటారు. కాబట్టి దోషాల గురించి మీకు చింత అక్కరలేదు. "వెనకాడవద్దు, చొరవ చెయ్యండి" అనేది వికీపీడియా విధానాల్లో ఒకటి. చొరవ చేసి రచనలు చెయ్యండి. అనుభవజ్ఞులైన సభ్యులు మీకు చేదోడు వాదోడుగా ఉంటూ మీకు అవసరమైన సాయం చేస్తారు.

పది కోట్ల మంది మాట్లాడే భాష మనది, మరి ఐదో స్థానంలో ఉండడమేంటి..

- ప్రచారం లేక. తెలుగులో వికీపీడియా అనే బృహత్తర విజ్ఞాన సర్వస్వం తయారౌతోంది అనే సంగతి చాలామందికి తెలియదు. 2006 నవంబరు 5 నాడు ఈనాడు దినపత్రిక ఆదివారం

సంచికలో తెలుగు వికీపీడియా గురించి వ్యాసం వచ్చింది. దాంతో తెలుగు వికీపీడియాకు ఎంతో ప్రచారం లభించింది. ఆ వ్యాసం కారణంగా సభ్యుల సంఖ్య 12 రోజుల్లోనే రెట్టింపైంది. ఆ తరువాతి కాలంలో మరిన్ని వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. అలా తెవికీని మరింత మందికి చేర్చే ఉద్దేశమే ఈ పుస్తకం కూడా.

మీరూ వికీపీడియాలో చేరండి. మీ స్నేహితులనూ చేర్పించండి. భావి తరాల వారికి ఒక స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వాన్ని అందించడంలో చేయి కలపండి.

అసలు తెవికీలో ఎందుకు రాయాలి

- ఇది మంచి ఉచిత సేవ. మంచి కాలక్షేపం. ఇందులో సముదాయ సభ్యులు ఉంటారు. వారితో వికీని గురించి ఇష్టాగోష్టి చర్చలు ఉంటాయి. మనకంటూ ఒక గుర్తింపు ఉంటుంది.

- ఇక వికీపీడియాలో ఎందుకు రాయాలి, రాస్తే ఏమోస్తుంది? అనే దానికి వస్తే, అవును.తెవికిలో ఎందుకురాయాలి, రాస్తే నాకేమి వస్తుంది అనే ఆలోచన రావటంలో ఎలాంటి తప్పులేదు. వికీపీడియా గురించి చెప్పగానే దాదాపుగా నూటికి 90 మందికి వచ్చే ఆలోచన ఇదే.

- అందరికీ అన్నీ విషయాల గురించి తెలియకపోవచ్చు, కానీ ప్రతి ఒక్కరూ ఏదో ఒక అంశంపై కొంత విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉంటారు. అలా అందరికీ తెలిసిన విశేష జ్ఞానాన్ని ఒకచోట చేర్చటం వలన విజ్ఞాన సర్వస్వం తయారవుతుంది.

అలా రాయబడిన విజ్ఞానసర్వస్వం ఉచితంగా వాడుకోవచ్చు, స్వేచ్ఛగా పంచుకోవచ్చు. అలాంటి సదుపాయం ఒక వికీపీడియాలో మాత్రమే ఉంది.

- ఈ రోజు మనకు తెలిసిన జ్ఞానం ఎక్కడనుండి సమకూరిందనే విషయానికి వస్తే, మనకన్నా ముందు తరాలవారు రాసిన గ్రంథాలు ద్వారా మనకు సమకూరింది. అలాగే మన ముందు తరాలవారికి మారుతున్న కాలాన్ని బట్టి అంతర్జాలంలో (నెట్) తగిన సమాచారం అందుబాటులో ఉండటానికి రాయాలి. తెలిసిన జ్ఞానం అందరికి పంచితేనే ఆ వ్యక్తికి, జ్ఞానానికి సార్థకత చేకూరుతుంది.ఆది నెరవేరాలంటే వికీపీడియా మంచి వేదిక.

ఇంతటి పెద్ద పనికి ఖర్చు కూడా గట్టిగానే అవుతుంది కదా, మరి ఆ ఖర్చుకు డబ్బులెలా సమకూరుస్తున్నారు?

- విరాళాల ద్వారా! సాఫ్టువేరు అభివృద్ధికీ, సర్వర్లు, ఇతర మిషన్లు కొనడానికి, హోస్టింగుకూ అవసరమైన ఖర్చుల కోసం విరాళాలు సేకరిస్తారు. ఈ విరాళాల సేకరణకు, తెలుగు వికీపీడియా లాంటి వెయ్యి పైచిలుకు ప్రాజెక్టుల నిర్మాణ నిర్వహణ, పోషణకూ వెన్నుదన్నుగా నిలబడిన సంస్థ ఒకటి ఉంది. అదే... వికీమీడియా ఫౌండేషన్!

వికీ ఐదు మూలస్థంభాలు

వికీపీడియా కొన్ని మౌలిక సూత్రాలపై ఆధారపడి పనిచేస్తుంది. వికీపీడియాలో పనిచేసే స్వచ్ఛంద సేవకులు ఏ అడ్డంకులూ లేకుండా సావధానంగా పనిచేసుకునేందుకు ఈ నియమాలు వీలు కలిగిస్తాయి.

	వికీపీడియా ఒక విజ్ఞాన సర్వస్వం. ఇది పరిశోధనా పత్రాలు ప్రచురించే వేదిక కాదు, వార్తాపత్రిక కాదు, ఉచితంగానో, వెలకో వెబ్‌లో స్థలం ఇచ్చే సంస్థ కాదు. మన స్వంత అభిప్రాయాలు, అనుభవాలు, వాదనలు ప్రచురించుకునే స్థలం అసలే కాదు.
	వికీపీడియా తటస్థ దృక్కోణాన్ని అనుసరిస్తుంది. అంటే వ్యాసాలు ఏ ఒక్క దృక్కోణాన్నీ ప్రతిబింబించకూడదు. విషయానికి సంబంధించిన అన్ని దృక్కోణాలను నిష్పాక్షికంగా, అది ఎవరి దృక్కోణమో వివరంగా తెలిసేలా సందర్భశుద్ధిగా ప్రతిబింబించాలి. దీనివలన చదువరులకు అది ఎవరి దృక్కోణమో తెలుస్తుంది. ఫలానా దృక్కోణం నిజమనీ, సరైనదనీ చూపించరు. అవసరమైన ప్రతిచోటా మూలాలను, వనరులను ఉటంకిస్తారు.
	వికీపీడియాను స్వేచ్ఛగా, ఉచితంగా వాడుకోవచ్చు. చదవడమే కాదు, దీనిలో ఎవరైనా రాయవచ్చు రాసినదానిలో సముచితమైన మార్పుచేర్పులు చెయ్యవచ్చు. ఇక్కడి వ్యాసాలు ఏ ఒక్కరికీ సొంతం కాదు. వ్యాసాల్లో ఎప్పటికప్పుడు కాలదోషం పట్టిన సమాచారం స్థానంలో తాజా సమాచారం చేరుస్తూ ఉంటారు.
	వికీపీడియా తోటి సభ్యులను గౌరవించాలి. వ్యక్తిగత దాడులు ఇక్కడ నిషిద్ధం. కొత్తవారిని సాదరంగా ఆహ్వానించాలి.
	వికీపీడియాలో సాఫీగా పనిచేసేందుకు వీలుగా కొన్ని విధానాలు, మార్గదర్శకాలను రూపొందించారు. ఈ విధానాలను ఎప్పటికప్పుడూ సమీక్షించుకుంటూ అవసరమైనా మార్పుచేర్పులు చేసుకుంటూ వెళ్తారు. ఈ విధానాల్లోని అక్షరాలు, మాటల కంటే వాటి స్ఫూర్తి, ఆదర్శమూ ముఖ్యంగా భావిస్తారు. కొన్ని సందర్భాల్లో వికీపీడియాను మెరుగుపరచేందుకు, నియమాలను పక్కన పెట్టాల్సి వస్తే అందుకు కూడా వెనకాడరు. ఏదేమైనా అందరూ చర్చించుకుని ఒక అంగీకారానికి వచ్చాకే తగు మార్పులు చేసుకుంటారు.

వికీపీడియా వ్యాసాల గురించి కొంత

వికీపీడియాలో సమాచారమంతా వ్యాసాల రూపంలో ఉంటుంది. విజ్ఞానసర్వస్వంలో ఉండదగిన అర్హతలు కలిగి, చదవడానికి వీలుగా సమాచారాన్ని కలిగివున్న దానిని వికీపీడియా వ్యాసం అంటారు. వ్యాస విషయానికే ఇక్కడ ప్రాధాన్యత ఉంటుంది. ఇక్కడ రాసే స్వచ్ఛంద సేవకుల అభిప్రాయాలు వీటిలో ఉండవు.

వికీపీడియాలో వ్యాసం పేజీకి ఒక నిర్దుష్టమైన రూపం ఉంటుంది. వ్యాసానికి పైన కొన్ని ట్యాబ్స్ ఉంటాయి. వీటిలో వ్యాసానికి సంబంధించిన చర్చ పేజీ, వ్యాస చరిత్ర వగైరా లింకులు ఉంటాయి. వ్యాసానికి అడుగున ఆ వ్యాస విషయానికి చెందిన వర్గాలు ఉంటాయి. వ్యాసానికి ఇరువైపులా వికీపీడియా సాధారణ లింకులు ఉంటాయి. వ్యాసం దేహంలో సమాచారం వివిధ విభాగాలుగా విభజించి ఉంటుంది. వ్యాసం లోని సమాచారాన్ని స్థూలంగా చూపుతూ ఒక పెట్టె ఉంటుంది. వ్యాసానికి సంబంధించిన బొమ్మలు ఉంటాయి.

వ్యాసం చర్చాపేజీ

వ్యాసానికి సంబంధించిన మార్పులు, ఇతర అంశాల గురించి వాడుకరులు చర్చలు జరిపే పేజీని చర్చాపేజీ అంటారు. ప్రతీ వ్యాసానికీ ఒక చర్చా పేజీ ఉంటుంది. వాసంలో రాసే సమాచారం గురించి వాడుకరులు ఇక్కడ చర్చించుకుని తదనుగుణంగా సమాచారాన్ని మెరుగుపరుస్తూంటారు.

సవరించు

వ్యాసంలో మార్పుచేర్పులు చేసేందుకు ఈ లింకును వాడతారు. ఈ లింకును నొక్కితే వ్యాసంలో మార్పుచేర్పులు చేసేందుకు వీలుకల్పించే ఒక ఎడిటరు తెరుచుకుంటుంది. రకరకాల పద్ధతుల్లో తెలుగును రాయగలిగే వీలు ఈ ఎడిటరులో ఉంది. తెలుగు టైపింగు రానివారు కూడా ఇక్కడ ఇట్టే టైపు చెయ్యవచ్చు. అసలు తెలుగు రాని పరాయి భాషల వ్యక్తులు కూడా తెలుగులో రాయవచ్చు (కాకపోతే తాము ఏమి రాస్తున్నామో వారికి తెలియదనుకోండి). అంత సులువైన ఎడిటరు ఇది.

చరిత్ర

వ్యాసం మొదలుపెట్టినప్పటి నుండీ, అందులో ఎవరెవరు, ఎప్పుడెప్పుడు,

ఏమేం మార్పుచేర్పులు చేసారో పూసగుచ్చినట్లు చూపించే పేజీ ఇది. ప్రతీ వ్యాసానికీ ఒక చరిత్ర పేజీ ఉంటుంది.

మూలాలు (రిఫరెన్స్ లు)

వికీపీడియాలో రాసిన సమాచారాన్ని ధ్రువీకరించేందుకు ఆ సమాచారాన్ని ఎక్కడి నుండీ సేకరించారో దాని వివరాలను చేరుస్తారు. వికీపీడియాలో ఇది తప్పనిసరైన అంశం. ఈ ఉల్లేఖనలను మూలాలు అంటారు. పాఠకులు ఆ మూలాలను బట్టి సమాచారాన్ని నిర్ధారించుకోవడాణికి ఇది వీలు కలిగిస్తుంది.

వర్గాలు

లక్ష పైన వ్యాసాల వికీపీడియాలో ఒకే రకమైన లక్షణాలున్న వ్యాసాలను ఒకచోట చేర్చి చూపించేందుకు ఈ వర్గం వీలు కలిగిస్తుంది. ఉదాహరణకు ఒక మండలం లోని గ్రామం గురించి చదువుతున్నామనుకోండి, ఆ మండలం లోని ఇతర గ్రామాల వ్యాసాలు కూడా అదే మండలం వర్గంలో కనపడుతాయి. అలాగే 1964 లో జన్మించిన వ్యక్తి వ్యాసంలో ఆ సంవత్సరం జన్మించిన వ్యక్తుల వర్గం ఉంటుంది.

కొత్త పేజీని (వ్యాసం) ఎలా సృష్టించాలి

వికీపీడియాలో వ్యాసం సృష్టించడం ఒక కొంత క్రమపద్ధతిలో చేయాల్సిన పని. దీని కోసం కొన్ని సూచనలు ఇవ్వబడినవి:

1. ముందుగా వికీపీడియా ఖాతా సృష్టించుకోండి.

    - వికీపీడియా ఖాతా అవసరం లేకుండానే వ్యాసాలను సవరించవచ్చు, కానీ ఖాతా సృష్టించడం ద్వారా మీ రచనలను,

మార్పులను ట్రాక్ చేయడం సులభం అవుతుంది.

2. విషయం గురించి పరిశోధన చేయండి.

- మీరు రాయాలనుకుంటున్న వ్యాసం ఇప్పటికే ఉందేమో చూడండి. వికీపీడియాలో ఇప్పటికే ఉన్న వ్యాసాలను మళ్లీ సృష్టించకూడదు. అంతేకాకుండా, వికీపీడియా నిబంధనలకు అనుగుణంగా వ్యాసం ఉండాలి, ముఖ్యంగా విశ్వసనీయ మూలాల ఆధారంగా వ్రాయాలి.

3. ప్రయోగశాల (సాండ్‌బాక్స్) లో వ్యాసాన్ని రాయడం మొదలు పెట్టండి

- మీ ఖాతాలో "సాండ్‌బాక్స్" (ప్రయోగశాల) అందుబాటులో ఉంటుంది. ఇందులో మీరు వ్యాసాన్ని సృష్టించి, దాన్ని సవరించుకోవచ్చు.

4. వికీపీడియా శైలిని అనుసరించండి

- వికీపీడియాకు నిర్దిష్ట శైలి ఉంది. వాస్తవమైన సమాచారం, స్వతంత్ర మూలాలు (పుస్తకాలు, వార్తలు, మొదలైనవి) ఆధారంగా రాయండి.

5. వ్యాసాన్ని ప్రచురించండి

- మీ వ్యాసం సిద్ధం అయిన తర్వాత, అది అన్ని ప్రమాణాలను అనుసరించిందని మీకు నమ్మకం కలిగి ఉన్నట్లయితే, దాన్ని ప్రచురించవచ్చు.

6. వ్యాసం సమీక్షకి పంపడం

- కొత్తగా సృష్టించిన వ్యాసాలు కొంత సమయం పాటు వికీపీడియా సబ్జెక్టుల ద్వారా సమీక్షకు నోచుకోవచ్చు. ముఖ్యంగా వికీపీడియాలో చర్చలు, సమీక్షలు సహజం, అందుకే మీ వ్యాసం ఒకసారి సమీక్షకు రావచ్చు. వ్యాసంలో మీ వ్యక్తిగత అభిప్రాయాలను లేదా అవాస్తవాలను పొందుపరచకుండా ఉండాలి.

అనువాద పరికరం

తెలుగు వికీపీడియాలో లక్ష వ్యాసాలుంటే ఇంగ్లీషు వికీపీడియాలో 70 లక్షల వ్యాసాలున్నాయి. ఆ వ్యాసాలలో మనకు నచ్చినదాన్ని తెలుగు లోకి అనువదించడం అనేది వికీపీడియాలో సాధారణంగా అనుసరించే పద్ధతి. ఇందుకోసం వికీపీడియాలో అంతర్గతంగా ఒక అనువాద పరికరాన్ని ఇమిడ్చారు కూడా. యాంత్రికానువాద సౌకర్యం ఉన్న ఉపకరణం ఇది. ఇందులో భాగంగా గూగుల్, యాండెక్స్, మింట్ అనే మూడు అనువాద యంత్రాలున్నాయి. వాటిలో ఏ యంత్రాన్నైనా వాడి అనువాదం చెయ్యవచ్చు. అనువాద పరికరం వాడాలంటే కనీస అనుభవం అంటూ పరిమితి ఏమీ లేదు. వికీపీడియాకు కొత్తవారైనా ఈ పరికరాన్ని వాడొచ్చు. అయితే వికీ పద్ధతుల గురించి తెలుసుకునేందుకు కొన్నాళ్ళు నేరుగా దిద్దుబాట్లు చేస్తే మంచిది.

అనువాద పరికరంతో ఉపయోగాలు: ఈ పరికరం మన పనిని కొంత సులభతరం చేస్తుంది. యంత్రం ద్వారా చేసే ఈ అనువాదం కొంతవరకు బాగానే ఉంటుంది. దాన్ని సరిచేసి ప్రచురించవచ్చు. తొందరగా అయిపోతుంది.. దాని వలన ముఖ్యంగా కింది ఉపయోగాలున్నాయి.

- యంత్రం చాలా వేగంగా అనువదిస్తుంది. మామూలుగా ఒక కొత్త వ్యాసం రాయడానికి పట్టే సమయంలో ఇరవై అనువాద వ్యాసాలు రాసెయ్యవచ్చు.

- మూలం లోని మూసలు అనువాదం లోకి కూడా ఆటోమాటిగ్గా వచ్చేస్తాయి. ప్రత్యేకించి వాటిని తయారు చెయ్యనక్కరలేదు.

- మూలంలో ఉన్న వికీలింకులు అనువాదం లోకి కూడా వస్తాయి. మనమేమీ చెయ్యనక్కరలేదు.



- మూలంలో ఉన్న వర్గాలు ఆటోమాటిగ్గా అనువాదం లోకి వచ్చేస్తాయి.
- మూలంలో ఉన్న పట్టికలు అనువాదం లోకి వచ్చేస్తాయి, పట్టిక లోని సమాచారం కూడా అనువాదమౌతుంది.

అయితే ఈ యాంత్రికానువాదం అసహజంగా ఉంటుంది. “మరియు”, "యొక్క" లాంటి కృతక పదాలను చేర్చుతుంది. కర్మణి వాక్యాలను విరివిగా రాస్తుంది. వీటిని సవరించి భాషను సహజంగా ఉండేలా తీర్చిదిద్దాకనే ప్రచురించాలి. అయితే ఆ అనువాదాన్ని సవరించడం తేలిగ్గానే అయిపోతుంది.

ఇంతకీ మేం చెప్పొచ్చేది ఏంటంటే..

- నేటి సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేద్దామని మీరు అనుకుంటే
- తెలుగు భాషలో విజ్ఞానాన్ని అందించేందుకు తోడ్పడదలిస్తే
- రాబోయే తరాల తెలుగుబిడ్డల కోసం ఒక విష్ణుశర్మ అవ్వాలనుకుంటే
- దశాబ్దాల పాటు పాఠాలు చెప్పి, వేలాది మంది పిల్లలను తీర్చిదిద్దిన మీ మేథను, మీ శక్తియుక్తులను లక్షల మంది కోసం వినియోగించదలిస్తే
- తెలుగు విజ్ఞాన భూమిలో ఒక మొక్క నాటడం కాదు, ఒక అడవినే పెంచాలని అనుకుంటే

మీరు తెలుగు వికీపీడియాలో రాయాల్సిందే. తెలుగు వికీపీడియాలో మీ అవసరం చాలానే ఉంది. **రండి!**

వికీమీడియా ఫౌండేషన్

2003 జూన్‌లో అమెరికాలో స్థాపించబడిన లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ. ప్రపంచం నలుమూలల నుండి సేకరించే విరాళాల ద్వారా ఈ సంస్థ పనిచేస్తుంది. విశ్వం లోని విజ్ఞానాన్ని ప్రపంచం లోని ప్రజలందరికీ స్వేచ్ఛగా, ఉచితంగా అందుబాటులోకి తేవడం దాని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం పలు విజ్ఞాన సర్వస్వ ప్రాజెక్టులను నెలకొల్పింది. ఈ ప్రాజెక్టులను నడిపేందుకు మీడియావికీ అనే సాఫ్టువేరును అభివృద్ధి చేసి, దాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఫౌండేషను, ఈ సాఫ్టువేరును నిరంతరం మెరుగుపరుస్తూ, కొత్త కొత్త అంశాలను ప్రవేశపెడుతూ ఉంటుంది. ఈ సాఫ్టువేరును ఉచితంగా డౌన్‌లోడు చేసుకుని ఎవరైనా తమ స్వంత వికీ వెబ్‌సైటును నెలకొల్పుకోవచ్చు. వికీమీడియా ఫౌండేషను ఈ సాఫ్టువేరును అభివృద్ధి చెయ్యడమే కాకుండా, దాని ఆధారంగా పలు విజ్ఞానసర్వస్వ ప్రాజెక్టులను నిర్మించింది. వికీపీడియా, వికీసోర్సు, విక్షనరీ, వికీకామన్స్, వికీడేటా వంటి పలు ప్రాజెక్టులను ఈ సాఫ్టువేరు ఆధారంగా నిర్మించింది. ఈ ప్రాజెక్టులను వందలాది భాషలలో స్థాపించి, నిర్వహిస్తూ వాటి పురోగతికి కృషిచేస్తోంది.

మీడియావికీ సాఫ్టువేరు

ఫౌండేషను కార్యకలాపాల్లో మీడియావికీ సాఫ్టువేరు అభివృద్ధి ఒక ప్రధానమైన అంగం. ఈ సాఫ్టువేరును ఎవరైనా ఉచితంగా డౌన్‌లోడు చేసుకుని వాడుకోవచ్చు. పాఠకులే రచయితలై కలిసిమెలిసి (కొలాబొరేషను పద్ధతిలో) కంటెంట్ మేనేజిమెంట్ వెబ్‌సైట్లను అభివృద్ధి చేసుకోవడం ఈ సాఫ్టువేరు ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థలు ఈ సాఫ్టువేరు ద్వారా తమ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ సాఫ్టువేరు ద్వారా అందిస్తున్నారు. తెలుగుతో సహా 400 కు పైగా భాషల్లో ఈ సాఫ్టువేరు అందుబాటులో ఉంది. నేరుగా అనేక లక్షల వెబ్‌సైట్లు ఈ సాఫ్టువేరుపై ఆధారపడి ఉండగా, వెబ్‌సైట్లను హోస్టు చేసే వివిధ హోస్టింగు సైట్లు కూడా ఈ సాఫ్టువేరును స్థాపించుకుని వాటిపై 75 వేల వెబ్‌సైట్లను హోస్టు చేస్తున్నాయి. వీటిలో ఫౌండేషను స్వయంగా నిర్వహిస్తున్న 900 సైట్లు కూడా భాగం. ఈ సైట్లలో 125 కోట్ల పేజీలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. 120 కోట్ల వాడుకరులు నమోదై ఉన్నారు. 43 లక్షల మందికి పైగా రోజూ ఈ సైట్లలో సమాచారం చేరుస్తూంటారు. 20 కోట్లకు పైగా ఫొటోలు, చిత్రాలు, ఇతర ఫైళ్ళూ ఉన్నాయి.

ఫౌండేషను స్థాపించిన వికీ ప్రాజెక్టులు

మీడియావికీ సాఫ్టువేరును అభివృద్ధి చెయ్యడంతో పాటు, ఆ సాఫ్టువేరు పునాదులపై అనేక విజ్ఞానసర్వస్వ వెబ్‌సైట్లను కూడా ఫౌండేషను నిర్వహిస్తోంది. వీటిలో వికీపీడియా మొదటిది, అత్యంత ప్రసిద్ధి పొందినదీ, అత్యంత ప్రజాదరణ పొందినదీను. ఇది 352 భాషలలో 6 కోట్ల పైచిలుకు వ్యాసాలతో ప్రపంచంలో కెల్లా అత్యంత ప్రజాదరణ పొందిన అన్ని రకాల వెబ్‌సైట్లలో 7 వ స్థానంలో ఉంది. ఈ వికీపీడియాల్లో తెలుగు వికీపీడియా లక్షకు పైగా వ్యాసాలతో 72 వ స్థానంలో, భారతీయ భాషా వికీపీడియాల్లో 5 వ స్థానంలో ఉంది. వికీపీడియాతో పాటు, వికీసోర్సు, వికీకోట్, విక్షనరీ, వికీవాయేజ్, వికీవార్సిటీ, వికీబుక్స్, వికీడేటా, వికీకామన్స్ వంటి అనేక ఇతర వెబ్‌సైట్లను కూడా నిర్వహిస్తోంది.

ఫౌండేషను నిర్వహించే వెబ్‌సైట్లలో నెలకు 2300 కోట్ల పేజీవ్యూలు ఉంటాయి. ఒక్క భారతదేశం లోనే నెలకు అన్ని రకాల వికీలకూ కలిపి 70 కోట్ల పేజీవ్యూలు ఉంటాయి. ఒక్క తెలుగు వికీపీడియాలో నెలకు కోటీ 30 లక్షల పేజీవ్యూలుంటాయి.

ఈ వెబ్‌సైట్లను హోస్టింగు చెయ్యడం, సాంకేతిక నిర్వహణ చెయ్యడం, సాఫ్టువేరును మెరుగుపరచడం వంటివి మాత్రమే ఫౌండేషను బాధ్యత.

ఈ ఖర్చుల కోసం విరాళాలు సేకరిస్తుంది. ఫౌండేషను నిర్వహించే ఏ వెబ్‌సైట్లలోనూ వ్యాపార ప్రకటనలుండవు. మీడియావికీ సాఫ్టువేరుతో సహా ఫౌండేషను అభివృద్ధి చేసి నిర్వహించే ఉత్పత్తులు సేవలూ అన్నీ ఉచితమే, సార్వజనీనమే, ఎవరైనా స్వేచ్ఛగా వాడుకోవచ్చు. ఎంత స్వేచ్ఛ అంటే, వికీపీడియా లోని సమాచారాన్ని ఉచితంగా డౌన్‌లోడు చేసుకుని వాటిని పుస్తకాలుగా ముద్రించి అమ్ముకోవచ్చు. ఈ సమాచారాన్ని వికీపీడియా నుండి సేకరించామని వెల్లడిస్తే చాలు. విరాళాల ద్వారా అందే సొమ్ము నుండి కొంత భాగాన్ని వివిధ ప్రాజెక్టుల్లో వాడుకరులు చేపట్టదలచిన ప్రత్యేక ప్రాజెక్టులు, సమావేశాలు, గోష్ఠులు, వగైరాల కోసం గ్రాంటులుగా అందిస్తుంది.

వీటిలో చేర్చే సమాచారంపై ఫౌండేషనుకు ఎలాంటి నియంత్రణా లేదు. సమాచారాన్నంతా స్వచ్ఛందంగా పనిచేసే వాడుకరులే పరస్పరం సహకరించుకుంటూ, సంప్రదించుకుంటూ సమాచారం చేరుస్తారు. ఈ వాడుకరులందరినీ కలిపి సముదాయం అంటారు. సమాచార ఎంపిక, విశ్వసనీయత, కాపీహక్కుల పాలన, వాడుకరుల పరస్పర వ్యవహార సరళి వంటి పలు అంశాలకు సంబంధించి ఈ సముదాయాలే నియమ నిబంధనలను ఏర్పరచుకుని పనిచేస్తాయి. ఈ వెబ్‌సైట్లలో సమాచారాన్ని చేర్చే వాడుకరులకు కూడా ఈ సమాచారంపై ఏ హక్కూ ఉండదు. ప్రచురితమైన సమాచారమంతా సర్వ మానవాళికీ చెందుతుంది.

2022 లో ఫౌండేషను వికీమీడియా ఎంటర్‌ప్రైస్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనిద్వారా వికీ ప్రాజెక్టుల్లో ఉచితంగా లభించే సమాచారాన్నే సంస్థలు నేరుగా పెద్దయెత్తున API ల ద్వారా అందుకునే సౌలభ్యాన్ని కల్పించింది. ఫౌండేషను ఈ సేవను ఉచితంగా ఇవ్వదు, విక్రయిస్తుంది. గూగుల్ వంటి సంస్థలు దీన్ని వాడుకుంటున్నాయి.

వికీమీడియా ఇతర ప్రాజెక్టులు

వికీమీడియా ఫౌండేషను వారు వికీపీడియా మాత్రమే కాకుండా, విజ్ఞానానికి సంబంధించిన పలు ఇతర ప్రాజెక్టులను కూడా నిర్వహిస్తోంది. వికీపీడియా లాగానే ఆ ప్రాజెక్టులు కూడా వివిధ భాషలలో ఉన్నాయి. తెలుగులో కింది ప్రాజెక్టులు ఉన్నాయి:

1. వికీసోర్స్: కాపీహక్కులు లేని పుస్తకాల గ్రంథాలయం
2. విక్షనరీ: ఉచిత నిఘంటువు
3. వికీవ్యాఖ్య - ప్రముఖుల వ్యాఖ్యలను ఒకచోట చూపించే నెలవు
4. వికీబుక్స్: కొత్తగా పుస్తకాలు రాసి ప్రజలకు ఉచితంగా అందించాలనుకునే వారికి ఇది చక్కటి స్థలం

5. వికీ కామన్స్: ఉచితంగా ఫొటోలు, ఇతర చిత్రాలు, ఆడియోలు, వీడియోలు లభించే ఖజానా
6. వికీడేటా - ప్రపంచ విజ్ఞానాన్ని ఒక పద్ధతిలో డేటాగా అమర్చే చోటు

సమగ్ర సాహిత్యం అంటే పుస్తకాలూ, పత్రికలూ, వ్యాసాలు, బొమ్మలే కాకుండా పద్యాలూ, వ్యాఖ్యలు, సామెతలు, పదాలు వంటివి కూడా వికీ ప్రపంచంలో వివిధ ప్రాజెక్టుల రూపంలో చోటు చేసుకుంటున్నాయి.



ఇంగ్లీషు వంటి ఇతర భాషలలో ఉండి, ఇంకా తెలుగులోకి రాని మరి కొన్ని ప్రాజెక్టులున్నాయి. వికీవాయేజ్, వికీవార్సిటీ, వికీస్పీసీస్ వంటివి వాటిలో కొన్ని. తెలుగులో ఉన్న ప్రాజెక్టుల విశేషాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

వికీసోర్స్

వికీసోర్స్ అంటే ఉచిత అంతర్జాల డిజిటల్ గ్రంథాలయం. దీనిని కూడా వికీమీడియా ఫౌండేషనే నిర్వహిస్తోంది. స్వచ్ఛంద సేవకులు కాపీహక్కులు లేని పుస్తకాలను సేకరించి, వాటిని డిజిటల్ రూపం లోకి మార్చి, నిర్వహించే ఒక స్వేచ్ఛాయుత గ్రంథాలయమిది. అన్ని రకాల చారిత్రక సాంస్కృతిక గ్రంథాలు, కావ్యాలు ఉచితంగా అనేక భాషలలో, అనువాదాలలో భద్రపరచడం (హోస్ట్ చేయడం) వికీసోర్స్ ప్రాజెక్టు లక్ష్యం. ఈ గ్రంథాల లోని సమాచారాన్ని వికీపీడియా వ్యాసాల్లో సముచితమైన చోట్ల వాడతారు కూడా.

కాపీహక్కులు ముగిసిన పుస్తకాలను డిజిటల్ రూపంలో చేర్చడమే కాకుండా, వాటిని పాఠ్యం (టెక్స్టు) రూపంలో టైపించి కూడా వికీసోర్సులో అందిస్తారు. తద్వారా ఈ పుస్తకాల లోని సమాచారాన్ని గూగుల్ వంటి సెర్చి ఇంజన్ల ద్వారా వెతికే వీలు కూడా ఉంటుంది. అంటే, "మెత్తని పులి" అనే పదం ఏయే తెలుగు పుస్తకాల్లో ఉందో వెతకాలంటే ఈ టెక్స్టుల్లో వెతికి

పట్టుకోవచ్చు. మామూలుగా డిజిటల్ రూపంలో ఉన్న పుస్తకాల్లో అలా వెతికే వీలు ఉండదు.

వికీసోర్స్ ప్రాజెక్టు అధికారికంగా 2003 నవంబరు 24 న 'ప్రాజెక్టు సోర్స్‌బర్గ్' పేరుతో ప్రారంభమైంది. దాని మొదటి లోగో 'మంచుకొండ (iceberg)' చిత్రం. 2003 డిసెంబరు 6 న ఈ ప్రాజెక్టుపేరును వికీసోర్స్ గా మార్చారు. 2004 జూలై 23 న 2004న ప్రాజెక్టుకు స్వంత, శాశ్వత డొమైన్ URL (http://wikisource.org/) సమకూరింది. ప్రస్తుతం వికీసోర్స్ తెలుగుతో పాటు 75 పైచిలుకు భాషలలో ప్రచురితమౌతోంది.

విషయ సూచిక, ట్రాన్స్‌క్రిప్షను, ప్రూఫ్ రీడింగ్, ట్రాన్స్కూషన్ వంటివి ఈ ఉపకరణాల్లో ప్రధానమైనవి. వికీసోర్సులో పని కింది దశల్లో జరుగుతుంది.

1. ముద్రిత రూపంలో ఉన్న మూల గ్రంథాన్ని స్కాను చేసి డిజిటలు రూపానికి మార్చడం
2. స్కాను చేసిన పేజీలను ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ పద్ధతిలో పాఠ్యం రూపంలోకి మార్చడం
3. స్కాను పేజీని, ఈ పాఠ్యం రూపంలో ఉన్న పేజీని పక్కపక్కనే పెట్టి వాడుకరులకు చూపించడం.
4. స్కాను రూపం లోని మూలాన్ని చదువుతూ పాఠ్య రూపంలో దోషాలేమైనా ఉంటే సవరించడం (టైపింగు)
5. పై దశలో టైపించిన పేజీని మరొక వాడుకరి చదివి ఇంకా దోషాలేమైనా ఉంటే సవరించడం (ప్రూఫ్ రీడింగు)
6. ప్రూఫ్ రీడింగైన పేజీని అంతిమంగా పరిశీలించి ప్రచురణకు ఆమోదించడం (ఆమోదం)

చివరి దశలో ఆమోదం పొందిన పేజీలు పాఠకులకు ఉచితంగా చదువుకోడానికి అందుబాటులో ఉంటాయి. చివరి మూడు దశల్లో చేసే పనిని అనేక మంది వాడుకరులు స్వచ్ఛందంగ పరస్పరం సహకరించుకుంటూ చేస్తారు.

ఎక్కడినుండి సేకరిస్తారు?

ఈ ప్రాజెక్టులో అంతర్జాలం (పబ్లిక్ డొమైన్)లో గ్రంథస్వామ్య హక్కులు లేని పుస్తకాలను లేదా లైసెన్స్ పొందిన ప్రతులను తీసుకుని ముందుగా డిజిటల్ రూపంలో వికీమీడియా కామన్స్ ప్రాజెక్టు లోకి ఎక్కిస్తారు. ఒకవేళ పుస్తకంపై కాపీహక్కులు ఉంటే, సదరు హక్కుదారుల నుండి పూర్తి స్వేచ్ఛా ధృవీకరణ పత్రం తీసుకుని పుస్తకాలను ఎక్కిస్తారు. పై రెంటికీ చెందిన పుస్తకాలను వికీసోర్సు లోకి తీసుకోరు. కింది రకాల పుస్తకాలను వికీసోర్సు లోకి తీసుకుంటారు.

- ఇంతకుముందే ఏదైనా రచయిత ప్రచురించిన మూలగ్రంథాలు. [అముద్రిత్య గ్రంథాలను ఇక్కడ తీసుకోరు]
- అసలు గ్రంథాల అనువాదాలు
- జాతీయ లేదా అంతర్జాతీయ ఆసక్తి ఉన్న చారిత్రక పత్రాలు
- వికీసోర్స్‌లో రచనలు ఉన్న రచయితల గ్రంథపట్టికలు
- ఈ జాబితాకు మాత్రమే పరిమితము కాని కొన్ని ఇతర రచనలు

కింది లక్షణాలున్న గ్రంథాలను వీకీసోర్సు లోకి స్వీకరించరు

- కాపీహక్కులకు లోబడీ ఉన్న పుస్తకాలు
- గణిత డేటా, సూత్రాలు, పట్టికలు
- కంప్యూటరు సాఫ్టువేరుకు సంబంధించిన సోర్స్ కోడ్
- గణాంక మూలడేటా (ఎన్నికల ఫలితాలు వంటివి)

తెలుగు వికీసోర్స్ 2005 ఆగస్టు 19 న ప్రారంభమైంది.



ప్రారంభంలో తెలుగు వికీసోర్స్ మొదటి పేజీ

శతకాలు, భగవద్గీత, వాల్మీకి రామాయణం, మొల్ల రామాయణం మొదలగునవి వికీసోర్స్ లో ఉన్నాయి. కన్యాశుల్కము, కోనంగి, రాజశేఖర చరిత్రము, గోన గన్నారెడ్డి, గణపతి వంటి ప్రసిద్ధ గ్రంథాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. ఇంకా అనేక జీవిత చరిత్రలు, ఇతిహాసాలు, కవిత్వము, నాటకాలు, పురాణాలు, వేదాలు, శతకాలు, సంకీర్తనలు, స్తోత్రాలు, పురాతన రచనలు, సినిమా పాటలు, ఇతర సంకలనాలు, పత్రికలు, విజ్ఞాన కోశాలు, నిఘంటువులు సేకరించి ఉంచారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 79 భాషల వికీసోర్సులలో నవంబర్ 2024 నాటికి తెలుగు వికీసోర్స్ ది 25వ స్థానం లో ఉంది. ఇంకా భారతీయ భాషలలో గుజరాతీ, బంగ్లా, తమిళం, మలయాళంల తరువాత ప్రస్తుతం తెలుగుది 5 వ స్థానం. 2024 నవంబరు నాటికి వికీసోర్సులో 20,140 పేజీలుండగా ఇప్పటి వరకు 4,50,000 పైచిలుకు దిద్దుబాట్లు జరిగాయి.

ఇవన్నీ డిజిటైజై, దోషాలను సరిదిద్దే స్వచ్ఛంద సేవకుల కోసం ఎదురు చూస్తున్నాయి. తెలుగు తెలిసిన వారెవరైనా ఈ పని చెయ్యవచ్చు.

మీరూ చేరండి, వికీసోర్సులో పలు గ్రంథాలపై పనిచెయ్యండి. కాపీరైట్ పరిధిలో లేని ఉద్గ్రంథాలని మీరు కూడా వికీ సోర్స్ లో ఎక్కించవచ్చు.

ప్రూఫ్ రీడింగ్ వంటి కార్యక్రమాలలో తోడ్పడవచ్చు.

విక్షనరీ

విక్షనరీ అంటే వికీ డిక్షనరీ అన్నమాట! ఇది కూడా ఒక వికీపీడియా సోదర వెబ్ సైటే. తెలుగు పదాలకు అర్థం, వ్యాకరణ అంశాలు, వాడుక, నానార్థ, వ్యతిరేకార్థాల లాంటి వివరణలను సేకరించి పెట్టిన ఉచిత నిఘంటువు. పుస్తక రూపంలో వుండే నిఘంటువులు మహా అయితే మూడు భాషలలో వుంటాయి. కానీ విక్షనరీ మాత్రం తెలుగు-తెలుగు, ఇంగ్లీషు-తెలుగుతో పాటు ఇతర భాషా విక్షనరీలోని సమాన అర్థం గల పదాలకు కూడా లింకులుండటంవలన, ప్రపంచంలోని పలు భాషలన్నిలో సమాన అర్థంగల పదాలను తెలుసుకునే వీలుంటుంది. దీనిని బహుభాషా నిఘంటువుగా పేర్కొనవచ్చు. దీనిని 2005 జులైలో ప్రారంభించారు. తెలుగు వికీపీడియాలో వలె, ఇందులో కూడా ఎవరైనా తెలుగు పదాలకు పేజీలను సృష్టించవచ్చు లేక మార్పులు చేయవచ్చు. 2007 ఆగస్టు-అక్టోబరు 2007 మధ్యకాలంలో బ్రౌణ్య నిఘంటువుని (సుమారు 32,000 పదాలు) నేరుగా విక్షనరీలో ఇమిడ్చారు. 2024 నాటికి విక్షనరీలో లక్షా ఐదువేల పైచిలుకు పదాలు ఉన్నాయి. ఈ పదాలకు సంబంధించిన పలు అంశాల వివరణలు చేర్చాల్సి ఉంది. ఆసక్తి ఉన్న ఔత్సాహికులెవరైనా ఈ పనిలో పాల్గొనవచ్చు.

విక్షనరీ రూపం

- విక్షనరీలో అర్ధ వివరణతో పాటు భాషా భాగాలు, వ్యుత్పత్తి, వచనం వుంటాయి. వ్యాకరణ ఉప విభాగంలో పదం విభక్తి, లింగము, నామవాచకమో, విశేషణం మొదలగునవి ఉంటాయి. వ్యుత్పత్తి ఉప విభాగంలో పదం మూల రూపము దాని మార్పులు తెలుస్తాయి.

- దీనిలో నానార్ధాలు, సంబంధిత పదాలు, వ్యతిరేక పదాలు ఉంటాయి. ఇందులో ప్రాంతీయ, మాండలికాల భిన్న రూప పదాలు, అలాగే పదానికి వివిధ విభక్తి రూపాలు, వివిధ విశేషణ రూపాలు పేర్కొనవచ్చు. పదాన్ని వాక్యాలలో, పద్య పాదాలలో, పాదాలలో, జానపదాలతో, సామెతలలో ఉన్న పదప్రయోగాలను కూడా ఇందులో చూడవచ్చు.

- ఇందులో ఆ పదానికి ఇతర భాషలో అర్ధాలు తెలిసిన వారు వాటిని చేర్చవచ్చు. అర్ధాల ప్రక్కన బ్రాకెట్ లో ఇతర భాషా ఉచ్ఛారణ తెలుగులో వ్రాయాలి. ఇక్కడ ఆయా భాషలకు లింకులు ఉంటాయి. వాటి మధ్య ఆ భాషా పదాన్ని వ్రాసినప్పుడు అది నేరుగా అయా భాషలలో ఆ పదం ఉన్న పేజీకి తీసుకు వెళుతుంది. ఇక మూలాలు, వనరుల వివరాలను చేర్చాలి.

- పదం గురించి తెలుగు వికీపీడియాలో వ్యాసం ఉంటే దాని లింకు కూడా ఉంటుంది.

- పదం ఏ వర్గంలో చేరుతుందో వ్రాయాలి. వర్గంలో చేర్చితే, సమాచార సాంకేతిక పదకోశం తయారీలో సహాయంగా వుంటుంది.

- ఆ పదానికి చిత్రాన్ని చేర్చగలిగితే భాష తెలియని వారికి కూడా పదమేమిటో అర్థం ఔతుంది. చిత్రాలు ఇతర వీకీల నుండి తెచ్చి పెట్టవచ్చు లేదా నేరుగా విక్షనరీ లోనే ఎక్కించవచ్చు.

పదాల సేకరణ

- విక్షనరీలో సాధారణంగా నిత్య జీవితంలో వాడే పదాలుంటాయి.

- ప్రస్తుతం విరివిగా వాడుకలో లేని పదాలు పెద్ద వారు వాడుతుంటారు వాటిని చేర్చి అర్థాలను వివరిస్తే మరుగున పడుతున్న పదాలు వెలుగులోకి వస్తాయి.

- జానపదులలో, పల్లె సీమల్లో కొన్ని చిత్రమైన పదాలు వాడుకలో ఉంటాయి. వాటిని కూడా ఇక్కడ చేర్చవచ్చు. పల్లె సీమల్లో విభిన్నతలు అధికంగా ఉంటాయి. వాటిని చిత్రాలతో ఉదహరిస్తే బాగుంటుంది. పల్లె పదాల్లో అమాయకత్వం, సహజత్వం ఎక్కువ అటువంటి పదాలను చేర్చవచ్చు. కుల పరంగా కొన్ని ప్రత్యేక పదాలు ఉంటాయి. వాటిని కూడా చేర్చవచ్చు. సంస్కృతి, సంప్రదాయాల పరంగా కొన్ని ప్రత్యేక పదాలు ఉంటాయి. వాటినీ చేర్చ వచ్చు. వ్యవసాయానికి సంబంధించి అనేక పదాలు ఉంటాయి వాటినీ చేర్చవచ్చు.

- వార్తా పత్రికలు, అంతర్జాల అభివృద్ధి వలన కొన్ని కొత్త పదాలు సృష్టింపబడతాయి. వాటిని కూడా పేర్కొన వచ్చు.

వికీకోట్

వికీకోట్ అనగా వికీవ్యాఖ్య. ప్రముఖ వ్యక్తులు, పుస్తకాలు, సామెతల నుండి సేకరించిన వ్యాఖ్యలను ఒకచోట చేర్చి, ఉచితంగా పాఠకులకు అందుబాటులో ఉంచడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ పనిని వాడుకరులే స్వచ్ఛందంగా, సమిష్టిగా, సమన్వయ కృషితో చేస్తారు.

ఈ ప్రాజెక్టు ఇంగ్లీషులో 2003 జూన్ 23 న ప్రారంభమైంది. ఇంగ్లీషులో ఇప్పటికి 54 వేల పేజీలు ఉన్నాయి, ఇతర భాషలలో ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా అనేక మంది వందల కొద్దీ సవరణలు చేస్తున్నారు ఇంకా అనేక కొత్త వ్యాఖ్యలు సృష్టిస్తున్నారు. మీరూ ఇందులో పాలుపంచుకోండి.

https://te.wikiquote.org/

వికీబుక్స్

వికీబుక్స్ అనేది వికీసోర్స్ లాంటి మరొక వికీమీడియా ప్రాజెక్టు. వికీసోర్స్ అనేది ఇదివరకే వేరేచోట్ల ప్రచురించబడిన గ్రంథాలను చేర్చే చోటు. ఎక్కడ ప్రచురించబడని గ్రంథాలను అక్కడ చేర్చరాదు. వికీబుక్స్ లో నేరుగా ప్రచురించవచ్చు. ఇక్కడీ పుస్తకాలను వాడుకరులందరూ కలిసి సమష్టిగా తయారు చేస్తారు. వికీబుక్స్ 2003 జూలై 10 న ఇంగ్లీశులో వికీబుక్స్ మొదటగా వెలుగు చూసింది. ఆంగ్లం, తెలుగుతో సహా ప్రస్తుతం 83 భాషలలో వికీబుక్స్ ప్రాజెక్టు ఉంది. తెలుగు వికీబుక్స్ ప్రస్తుతం 149 పుస్తకాలు ఉన్నాయి.

https://te.wikibooks.org/

వికీమీడియా కామన్స్

వికీమీడియా కామన్స్ ను వికీకామన్స్ అనీ, కామన్స్ అనీ కూడా అనవచ్చు. లక్షలాది ఫొటోలు, ఇతర బొమ్మలు, ఆడియో వీడియో ఫైళ్ళూ ఉన్న విస్తారమైన భాండాగారం. ఇది కూడా వికీమీడియా ఫౌండేషను వారు స్థాపించిన ప్రాజెక్టే. ఈ ప్రాజెక్టు 2004 సెప్టెంబరు 7 న ప్రారంభమైంది. 2024 నవంబరు నాటికి కామన్స్ లో 11 కోట్ల పైచిలుకు ఫైళ్లున్నాయి.

వికీ కామన్స్ కు ఒక విశిష్టత ఉంది. ఇక్కడ ఫొటోలు బొమ్మలను ఎవరైనా చేర్చవచ్చు. ఫైలు నాణ్యంగా ఉంటే చాలు. వికీమీడియా కామన్స్ భాండాగారం లోని ఫైళ్లు పబ్లిక్ డొమైన్ లో కానీ, క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్/షేర్-అలైక్ లైసెన్స్ కి అనుగుణంగా గానీ ఉంటే అప్ లోడు చెయ్యవచ్చు.

వికీ కామన్స్ కు మరొక విశిష్టత ఉంది. ఇక్కడి ఫైళ్ళను వికీపీడియా, వికీబుక్స్, వికీ వ్యాఖ్య, వికీసోర్స్ వంటి ఏ వికీమీడియా ప్రాజెక్టులోనైనా, ఏ భాషకు చెందిన ప్రాజెక్టులోనైనా సరే నేరుగా ఉపయోగించుకోవచ్చు. వెబ్ సైటు వేరైనప్పటికీ, దాన్ని ప్రత్యేకించి ఆ ప్రాజెక్టులో మళ్లీ అప్ లోడు

చెయ్యనక్కరలేదు. ఒకే ఫైలును వివిధ ప్రాజెక్టుల్లో వాడేటపుడు ప్రతీ ప్రాజెక్టు లోకీ ఆ ఫైలును అప్‌లోడు చేసే డూప్లికేషనును నివారించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం.

వికీ కామన్స్ లో ఇంకో విశిష్టత కూడా ఉంది. ప్రతి మీడియా ఫైలు పేజీ లోనూ, దానికి సంబంధించిన లైసెన్స్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

వికీ కామన్స్ లో విశిష్టతలకు కొదవే లేదు. అన్నిటినీ మించిన విశిష్టత ఏంటంటే.. ఇందులోని బొమ్మలను, ఇతర ఫైళ్ళనూ ఎవరైనా ఉచితంగా వాడుకోవచ్చు. వాటిని వ్యాపార ప్రయోజనాల కోసం కూడా ఉచితంగా వాడేసుకోవచ్చు. మూలానికి, దాన్ని ఎక్కించినవారికీ తగిన విధంగా గుర్తింపు ఇస్తే చాలు.

రండి, మీరు కూడా మీరు స్వంతంగా తీసిన ఫొటోలను ఎక్కించండి.
అలాగే, మీరు ఏదైనా బొమ్మ కోసం వెతుకుతున్నారా? ---
అయితే, వికీకామన్స్ లో వెతకండి.
దొరికితే పూర్తి రిజల్యూషనులో ఉండే నాణ్యమైన బొమ్మలను దింపుకోండి.
మీకు కావలసిన విధంగా ఉచితంగా వాడేసుకోండి.

https://commons.wikimedia.org/

వికీడేటా

వికీడేటా అనేది వికీమీడియా ఫౌండేషన్ అందిస్తున్న డేటా ఖజానా. వికీపీడియాలో సమాచారం వ్యాసరూపంలో ఉంటుంది. భాష తెలిసిన మనుషులు దాన్ని చదివి అర్థం చేసుకోగలుగుతారు. వికీడేటాలో అదే సమాచారం డేటాంశాల రూపంలో ఉంటుంది. దాన్ని కంప్యూటర్లు కూడా చదివి అర్థం చేసుకుంటుంది. తద్వారా వికీడేటా లోని డేటాను వాడుకుని కంప్యూటరు ద్వారా అనేక రకాలైన విశ్లేషణలు చేసే వీలుంటుంది. ఇక్కడి డేటాను వివిధ భాషలలో చేరుస్తారు. తద్వారా మానవులు కూడా దీన్ని చదివే వీలుంటుంది. సెమాంటిక్ వెబ్ ను నిర్మించడంలో వికీడేటా పనికొస్తుంది.

వికీడేటాలో ఉన్న డేటా అంతా సార్వజనికంగా అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇతర వికీమీడియా ప్రాజెక్టుల లాగానే ఇక్కడ సమాచారాన్ని ఎవరైనా చేర్చవచ్చు, ఎవరైనా స్వేచ్ఛగా ఉచితంగా వాడుకోవచ్చు.

https://www.wikidata.org/

తెవికీ సంస్కృతి

(వికీలో మర్యాద ముఖ్య కీలకాంశం)

వికీపీడియాలో ఎన్నో ప్రాంతాలకు చెందినవారు స్వచ్ఛందంగా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేరతారు. ప్రతి ఒక్కరికీ విభిన్న ఆలోచనా ధోరణులు, భిన్న అభిప్రాయాలు, దృష్టికోణాలు ఉండవచ్చు. అయితే స్వయంగా ముఖ పరిచయాలు లేనప్పటికీ ఇతర సంపాదకులను, సభ్యులను గౌరవించడం, ఆదరించడం, కలసికట్టుగా సమన్వయంతో పనిచేయాలి.

- ఇతరులు మీతో ఎలా వ్యవహరించాలనుకుంటారో, మీరు వారితో అలాగే వ్యవహరించండి.
- విషయంపై వాదించండి, వ్యక్తులపై కాదు.
- ప్రశ్నలను ఎదుర్కోండి, తప్పుకోకండి.
- ఇతర సభ్యులు మీ దిద్దుబాటుతో అంగీకరించకపోతే, అది సరైనదని ఎందుకు అనుకుంటున్నారో సకారణంగా వివరించండి.
- అవతలివారు చెప్పేది సరైనది అని అనిపిస్తే ఒప్పేసుకోండి; మీ వ్యతిరేకత మీ అభిరుచి ప్రకారమే అయితే అదే విషయాన్ని ఒప్పేసుకోండి.
- మీరు చెప్పని విషయాలపై ప్రజలు చర్చించుకునేలా చెయ్యకండి.
- మర్యాద పాటించాలి. ఇది వికీలో గొప్ప సంప్రదాయం.

- చర్చ మంచి వేడిగా ఉన్నపుడు, అవతలి వారు మీరు ఆశించినంత మర్యాదగా ప్రవర్తించనపుడు, మీరు వారి కంటే ఎక్కువ మర్యాదగా ఉండండి. తక్కువ మర్యాదగా కాదు. ఆ విధంగా ఘర్షణను సృష్టించిన పాపం మీకు చుట్టుకోదు. ఓ దెబ్బ తిన్నాక కూడా ఎదురుదాడి చెయ్యకుండా సంయమనంగా వ్యవహరించినట్లు. చూసేవాళ్ళంతా దీన్ని హర్షిస్తారు. (కనీసం హర్షించాలి).
- అయితే, వారు మాట్లాడే విధానం మీకు నచ్చలేదని స్పష్టంగా చెప్పండి. లేకపోతే మీకు తెలియకుండానే వాళ్ళను ప్రోత్సహించినట్టవుతుంది.
- మీది తప్పైనపుడు మన్నించమని అడిగేందుకు వెనకాడకండి. "అయ్యో అలా అనకుండా ఉండాల్సింది" అని తరువాత అనుకునే సందర్భాలు చర్చల్లో వస్తాయి. అలా అనిపించినపుడు అదేమాట చెప్పెయ్యండి.
- మీకు ఆప్తమైన విషయాలను గమనింపులో పెట్టుకుని వాటి పట్ల పక్షపాతంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా ఉండండి.
- అభినందించాల్సినపుడు అభినందించండి. ప్రతివారూ మెప్పుదలను కోరుకుంటారు. సభ్యుని చర్చాపేజీలో మీ మెప్పుదలను వ్రాయండి.
- పరోక్ష విమర్శలు చేయవద్దు.

ఆవకాయ నుంచి అంతరిక్షం దాకా

- లక్ష పైచిలుకు వ్యాసాలు
- లక్ష పదాల నిఘంటువు
- 20 వేల పైచిలుకు తెలుగు గ్రంథాల పేజీలు - మహాభారతం నుండి కన్యాశుల్కం దాకా
- ప్రముఖుల ఉవాచలు, వ్యాఖ్యలు
- తెలుగు పదాలు, వాటి ఉచ్చారణ - ఆడియో ఫైళ్ళు
- 21 వేల మంది వ్యక్తుల జీవిత చరిత్రలు
- 5 వేల మంది మహిళల జీవిత చరిత్రలు
- భారతదేశం లోని అన్ని జిల్లాల సమాచారం
- 27 వేల మండలాల, గ్రామాల సమాచారం
- రాజ్యాంగం, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభలు, నియోజకవర్గాలు, ఎన్నికలు, సభ్యులు
- తెలుగు సినిమాలు, నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సంస్థలు
- చారిత్రిక యోధులు, స్వాతంత్ర్య యోధులు, క్రికెట్ వీరులు,
- మ్యాపులు, ఫొటోలు
- తెలుగు గ్రంథాలు, సామెతలు, సంస్కృతి, చరిత్ర, జీవన విధానం
- ఆరోగ్యం, జబ్బులు, ఔషధాలు

ఇందులో ఏమున్నాయంటే

వికీపీడియా - ఉచిత విజ్ఞానసర్వస్వం

వికీమీడియా ఫౌండేషన్

వికీసోర్స్ - కాపీహక్కులు లేని పుస్తకాల గ్రంథాలయం

విక్షనరీ - ఉచిత నిఘంటువు

వికీవ్యాఖ్య - ప్రముఖుల వ్యాఖ్యల నెలవు

వికీబుక్స్ - కొత్తగా పుస్తకాలు రాసి ప్రచురించే స్థలం

వికీ కామన్స్ - ఉచిత ఫొటోలు, ఆడియోలు, వీడియోల ఖజానా

వికీడేటా - ప్రపంచ విజ్ఞానాన్ని డేటాగా అమర్చే చోటు

TELUGU WIKIMEDIANS USER GROUP

తెలుగు వికీపీడియా ఇంకా ఇతర ప్రాజెక్టులలో సహాయం కొరకు సంప్రదించండి.

teluguwiki.help@gmail.com